నేడు విద్యుత్ అంతరాయం

పుల్లంపేట : వత్తలూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్నందున నేడు (ఆదివారం) వత్తాలురు, పాపక్కగారిపల్లి, మల్లెంవారిపల్లి, వడ్డిపల్లి, పాదల్లోపల్లి తదితర గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సైనిక అమరులకు శ్రద్ధాంజలి

రాయచోటి అర్బన్ : ఈనెల 16న జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పులలో మృతి చెందిన జవాన్లకు శనివారం రాయచోటి రోటరీక్లబ్ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరిహద్దులో జవానుల అందిస్తున్న సేవలను కొనియాడారు.

నేడు గంగ జాతర

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లెలో నేడు (ఆదివారం) గంగమ్మతల్లి జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం నుంచే ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆదివారం ఉదయం పొంగళ్లు, చల్లపోసుకోనున్నట్లు తెలిపారు. జాతరకు భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ వారు కోరారు.

యూనిఫాం పంపిణీ

సంబేపల్లె : మండల పరిధిలోని బొగ్గులవారిపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తిరుపాల్‌నాయక్, రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు.

అలీఖాన్ ప్రజాసేవకై పరితపించేవారు



ఆసిఫ్‌అలీఖాన్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న జకియాఖానం, కౌన్సిలర్లు

రాయచోటి అర్బన్ : అందరికి ఆదర్శప్రాయుడు దివంగత కౌన్సిలర్ ఆసిఫ్ అలీఖాన్ అని శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ పాలకవర్గం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన 30వ వార్డు కౌన్సిలర్ ఆసిఫ్‌అలీఖాన్ మృతికి సంతాపం తెలియజేసింది. ఆసిఫ్‌అలీఖాన్ చిత్రపటానికి కౌన్సిలర్లతో కలసి ఆమె శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె మాట్లాడుతూ ఆసిఫ్‌అలీ ఖాన్ నిరంతరం ప్రజాసేవకై పరితపించేవారన్నారు. కులమతాలు, రాజకీయాలకతీతంగా సేవ చేసేవారన్నారు. పట్టణంలోని వీరభద్రాలయం వెనుక భాగంలో ఉన్న ఇళ్లను తొలగించి ఆలయానికి మాఢ వీధులు ఏర్పాటయ్యేలా చూడడంలో ఎంతో కీలకపాత్ర పోషించారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ విభాగాల మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

23 నుంచి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

సిద్దవటం : మండలంలో ఈనెల 23, 24, 26, 27 తేదీలలో ఆధార్ సెంటర్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23న సిద్దవటం గ్రామ సచివాలయంలో ఆధార్ సెంటర్ క్యాంపును నిర్వహిస్తారన్నారు. సిద్దవటం సచివాలయానికి ఈనెల 23న రావాల్సిన గ్రామాలు పొన్నవోలు, సిద్దవటం, వంతాటిపల్లె, గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు రావాలన్నారు. 24న మాచుపల్లె, టక్కోలు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు రావాలన్నారు. 26వ తేదీన పెద్దపల్లె గ్రామ సచివాలయంలో ఆధార్ సెంటర్ క్యాంపునకు పెద్దపల్లి, బొగ్గిడివారిపల్లె, గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు రావాలన్నారు. 27న మాధవరం-1, మాధవరం-2, ఉప్పరపల్లె సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు రావాలన్నారు. ఆధార్ క్యాంపులో బయోమెట్రిక్ (వేలిముద్రలు), డాక్యుమెంట్ల అప్‌డేట్, 0–5 సంవత్సరాల వయస్సు గల పిలలకు కొత్తగా ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు పిల్లల భర్త సర్టిఫికెట్‌ను వెంట తెచ్చుకోవాలన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని ఆయా గ్రామాలలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. 23న కుమ్మరపల్లి, వెంకటరెడ్డిగారిపల్లె, గువ్వలచెరువు, 24న కసిరెడ్డిగారిపల్లె, కొత్తపల్లి, బయారెడ్డిగారిపల్లె, సూర్యనారాయణపురం, 25న చిట్లూరు, సరస్వతిపల్లె, కల్పనాయినిచెరువు, 26న పప్పిరెడ్డిగారిపల్లె, సరస్వతిపల్లెలో, గువ్వలచెరువులో స్పెషల్ మొబైల్ క్యాంపులు ఉంటాయన్నారు.

విషజ్వరాల నుంచి కాపాడండి

రాయచోటి అర్బన్ : విషజ్వరాల బారి నుంచి ప్రజలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల సంఘం నేతలు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి నడిబొడ్డున ప్రవహిస్తున్న మాండవ్యనది మురుగునీరు, చెత్తాచెదారానికి నిలయంగా మారి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిందన్నారు. పట్టణంలోని మురుగునీరంతా మాండవ్యనదిలోకి చేరి నిల్వ ఉంటోందన్నారు. మురుగునీటిని పట్టణానికి దూరంగా తరలించేందుకు చర్యలు చేపట్టి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేలా మున్సిపల్ అధికారులు చూడాలని విన్నవించారు. ఈ మేరకు వారు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు గౌరవ వేతనం చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసిన వలంటీర్లు

పెనగలూరు : వలంటీర్లకు గౌరవ వేతనం చెల్లించాలని పెనగలూరు – 2 సచివాలయానికి సంబంధించిన వలంటీర్లు శనివారం ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల ప్రభుత్వం పేపర్ బిల్లు చెల్లించరాదని జీఓ జారీ చేసిందని, పేపర్ బిల్లు మినహాయించి యథావిధిగా రూ. 5 వేలు గౌరవ వేతనం చెల్లించాలని వారు కోరారు. స్పందించిన ఎంపీడీఓ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణాల నుంచి మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లు

రాయచోటి అర్బన్ : పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను విక్రయించే, వినియోగించే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. శనివారం ఆయన మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలసి ప్లాస్టిక్ కవర్ల విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించిందన్నారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపౌరుడు సహకరించాలన్నారు.

300 కేజీల ప్లాస్టిక్ కవర్లు సీజ్

మున్సిపల్ అధికారులు శనివారం పట్టణంలోని పలు దుకాణాలలో నిర్వహించిన తనిఖీల్లో 300 కేజీల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ క్రయ, విక్రయాలు మళ్లీ నిర్వహించే దుకాణదారులకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, శానిటరీ, సచివాలయం, పోలీసు సిబ్బందిలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచాలి



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి అశోక్‌రెడ్డి

రామాపురం : రైతులు రసాయనాల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచాలని డీఆర్‌సీ ఏడీఏ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బి.రాచపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మాట్లాడుతూ రసాయనాల వల్ల భూసారం తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో వచ్చే లాభాలను, కేంద్రం అందించే ప్రోత్సాహకాలను తెలియజేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ద్రవాలు. కషాయాల తయారీ విధానం, ఉపయోగించడంపై వివరించారు. ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉద్యానవన పంటల సాగు, తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, అంతర పంటల ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ నాగమణి, సుచిత్ర, మధుకర్, ఆదర్శ రైతు శ్రీనాథ్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.



దేవీ ఉపాసకుడు.. సేవాతత్పరుడు

- మూడు దశాబ్దాలుగా గడియారం ప్రసాద్ శర్మ ఆధ్యాత్మిక సేవలు
- ఏ చిన్న శుభకార్యక్రమం చేపట్టాలన్న గడియారం వద్దకే అడుగులు
- గురుపౌర్ణమి సందర్భంగా 'గడియారం'పై సాక్షి అందిస్తున్న కథనం

రాజంపేట : ఆయన పేరు గడియారం ప్రసాద్ శర్మ రాజంపేట, రైల్వేకోడూరు ఏరియాలతో పాటు దేశ, విదేశాలలో ఉన్నవారికి అపారమైన నమ్మకం. ఆయన జ్యోతిష్యం, వాస్తు, దోష నివారణలు, కుటుంబాల సుభిక్షం కోసం హోమాలు, పూజా కార్యక్రమాలు ఏకధాటిగా మూడు దశాబ్దాలుగా చేస్తుండటంతో ఈ ప్రాంతంలో పేరు ప్రఖ్యాతులు సాధించుకున్నారు. ఎందరికో తనంటే అపారమైన గౌరవం, భక్తిభావాలను పెంపొందించుకునేలా గడియారం ప్రసాద్ శర్మ ప్రసిద్ధికెక్కారు. దేవీ ఉపాసకులుగా కొనసాగుతున్నారు. నిరాహారులై కేవలం ద్రవ పదార్థాలతో రెండున్నర సంవత్సరాల నుంచి గడుపుతుండటం గమనార్హం.

రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలంలోని చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన గడియారం కృష్ణమూర్తి, సుబ్బలక్ష్మి దంపతుల కుమారుడు ప్రసాద్‌శర్మ. తరతరాలుగా ఈ కుటుంబం పురోహిత్యంలో దిట్టగా నిలిచింది. ప్రసాద్‌శర్మ తన గురువు అయిన మానం రెడ్డప్పశర్మ వద్ద శిష్యరికంతో ఎన్నో అధ్యాత్మిక విద్యలు నేర్చుకున్నారు. ఇందులో ప్రధానంగా అనారోగ్య పీడితుల ఆరోగ్యపరిస్థితి మెరుగుపరిచేందుకు, వివాహం కాని వారికి దోష నివారణ నిమిత్తం పూజలు చేయడంలో గడియారం ఖ్యాతిని ఆర్జించారు. ఉన్నవారు, తప్పిపోయిన వారిని భగవత్ దృష్టితో గుర్తించి చెప్పడం, వారిని తిరిగి రప్పించడం అనేక సంఘటనలు ప్రసాద్‌శర్మ వల్ల జరిగాయి. దివ్యదృష్టితో జలగ్గమిని గుర్తించి రైతాంగానికి మేలుచేసే స్వామిగా పేరొందారు. పేదలకు తనవంతు సాయంలోనూ గడియారంది పెద్దచెయ్యే. 15 కుటుంబాలకు నిత్య పోషణకు శర్మ సాయం అందిస్తున్నారు. నిత్యం జరిగే హోమాలు, పూజల వల్ల పరోక్షంగా పేద బ్రాహ్మణులకు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆధ్యాత్మికపరంగా ప్రతి ఒక్కరిలో మంచి భావనలు, సన్మార్గం వైపు నడిచేలా తాను అనేక ఆధ్యాత్మిక, పూజ కార్యక్రమాలను చేస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులోనూ ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మాన్ని వ్యాప్తి చేసేందుకు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.



గడియారం ప్రసాద్‌శర్మ

వంగిమళ్లలో పీర్ల ఊరేగింపు

వీరబల్లె : మండలంలోని వంగిమల్ల పెద్దూరు కస్పాలో మొహర్రం వేడుకలను పురస్కరించుకొని మూడవరోజు మూడు పెద్దపీర్లను పీర్ల చావిడిలో కొలువుతీర్చి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు ఉన్న భక్తులు బాసికాలు తీసుకువచ్చి పీర్లకు సమర్పించారు. అనంతరం పీర్లను గ్రామంలో ఘనంగా ఊరేగించారు.

రక్త గ్రూపును తెలుసుకోవాలి

రాజంపేట టౌన్ : ప్రతి ఒక్కరు తమ రక్త గ్రూపును తెలుసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణరాజు తెలిపారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో, ఆపరేషన్ల నిమిత్తం అనేక మందికి రక్తం అవసరం అవుతుందని అలాంటప్పుడు రక్తగ్రూపు తెలిసివుంటే రక్తదానం చేసేందుకు వీలవుతుందన్నారు. దాదాపు 400 మంది విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అవసరమున్న సమయాల్లో రక్తదాన చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడిన వారమవుతామనేది గుర్తించుకోవాలన్నారు.

ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె : ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిరి అని లక్కిరెడ్డిపల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుధీర్ కుమార్ బదిలీపై కాశినాయన నరసాపురం మోడల్ స్కూల్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో శనివారం ఉపాధ్యాయుడు సుధీర్ కుమార్‌ను తోటి ఉపాధ్యాయులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు సుధీర్ కుమార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గురు పౌర్ణమి, దత్త జయంతి

రామాపురం : నేడు గురు పౌర్ణమి, దత్త జయంతి వేడుకలను మండలంలోని నీలకంఠ్రావుపేట సద్గురు అనంత ఆశ్రమం గువ్వలచెరువులో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. దర్బార్‌సాయి మందిరంలో ఆదివారం ఉదయం సాయినాధునికి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు జరుపుతామని పేర్కొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం వైభవంగా పల్లకీ ఉత్సవం జరుపనున్నట్లు తెలియజేశారు.